సబ్బవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - సబ్బవరం: పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని గ్రంథాలయం అధికారి వి.శిరీష అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అలాగే విద్యార్థులచే నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు కావలసిన నీతి కథలు, రామాయణం, మహాభారతం జీవిత చరిత్ర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్ అధికారి రత్నకుమార్, 30 మంది విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1 నుండి చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ

జిల్లా సరఫరాల అధికారి కెవిఎల్ఎన్ మూర్తి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 1 నుండి నిత్యవసర సరుకులు చౌక ధరల దుకాణాల ద్వారానే పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా పంపిణీ అధికారి కెవిఎల్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 1 నుండి చౌక ధరల దుకాణాల వద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికి సరుకులు పంపిణీ ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో గల 1069 చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఒకటో తేదీ నుండి 15వ తేదీన లోపల కుటుంబంలోని ఎవరైనా వెళ్లి సరుకులు పొందవచ్చునని తెలియజేశారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 నుండి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 4 నుండి 8 గంటల వరకు పని చేస్తాయని, ఆ సమయంలో లబ్ధిదారులు సరుకులు తీసుకోవాలని తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుండి 4 గంటల సమయంలో వారి ఇంటి వద్దకే సరుకులు అందజేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు రాష్ట్రంలో ఏ చౌక ధరల దుకాణం నుంచైనా వారి సరుకులు పొందవచ్చునని తెలిపారు. రేషన్ కార్డులు మార్పులు చేర్పులు మొదలైన ఏడు అంశాలకు సంబంధించి సేవలను అందించడం జరుగుతుందని, ఇప్పటివరకు 21వేల దరఖాస్తులు అందాయని, వాటిని నిర్దిష్ట గడువు 21 రోజులలో పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.)లో వచ్చిన అర్జీలు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా డివిజన్, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను దరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని దరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సరోజినీ, జిల్లా అబ్కారి శాఖ అధికారి వి.సుధీర, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: కడపలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి ముఖ్య నాయకులు తరలి వెళ్లారు. సోమవారం కోటవరట్ల మండలం నుంచి జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, ఎస్.రాయవరం మండలం మాజీ ఎంపీపీ వై. వినోద్ రాజు ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు తమ సొంత వాహనాల్లో మహానాడుకు పెదగుమ్ములూరు గ్రామం నుంచి బయలుదేరారు. అదేవిధంగా మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బస్సులోని టిడిపి కార్యకర్తలు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లు నరసింహమూర్తి, తన్నీరు ఎరకయ్య, చంటి, గోరింట్ల సత్తిబాబు, అల్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు అరికట్టాలి

ఏ.పి. రైతు సంఘం డిమాండ్ ...

విశాలాంధ్ర - చోడవరం రూరల్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మకాలను అరికట్టాలని ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చోడవరం రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారిణి ఈ.పావనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు పురుగుమందులతో రైతాంగం పూర్తిగా నష్టపోతున్నారని తెలియజేశారు. ప్రభుత్వం రైతులకు 90% సబ్సిడీపై నాణ్యమైన నమ్మకమైన విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేయాలని, నకిలీలను అరికట్టాలన్నారు. గతంలో ఉన్న చట్టాలను మార్చి నకిలీ పురుగు మందులు విత్తనాలు అమ్మే వ్యాపారులపైన పి.డి యాక్ట్ అమలు చేయాలని కోరారు. రైతులు కష్టపడి పండించిన పంట చేతికి అందే సమయంలో ఆశ ఆనందంతో ఉంటున్న రైతు కుటుంబాలను కల్తీ విత్తనాలు, పురుగు మందులు పూర్తిగా దెబ్బతీసి, రైతు కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని రెడ్డిపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు చోడవరం రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన తెలియజేసి మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పత్తి సత్తిబాబు, సింగంపల్లి దేవుడు, జోగా శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.

దివీస్ వేసిన వ్యర్థాల పైప్‌లైన్ తొలగించాలి

- జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోసా అప్పలరాజు

విశాలాంధ్ర - పాయకరావుపేట: కాకినాడ జిల్లా దివిస్ పరిశ్రమ ఎటువంటి అనుమతులు లేకుండా సముద్రంలో వేసిన వ్యర్థాల పైప్ లైన్ వెంటనే తొలగించాలని జాతీయ మత్యకార సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని కొర్లయ్య పేట గ్రామంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమ వల్ల ప్రజలకు, మత్స్యకారులకు కలిగే నష్టం గురించి కరపత్రాలు, మైక్ సెట్ ద్వారా ప్రజలకు తెలిసేలా ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు విడుదల చేశారు. పరిశ్రమ వేసిన పైప్ లైన్ వల్ల సముద్ర జలాలు కలుషితమై, సముద్రంలో మత్స్య సంపద నాశనమై మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ అనుమతులకు మించి భూగర్భ జలాలు ఉపయోగిస్తూ భూగర్భ జలాలు అడుగంటి పోయే విధంగా పరిశ్రమకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. పై రెండు విషయాలు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు ఫిర్యాదు చేసి, సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించామని తెలిపారు. సముద్ర తీరం వెంట మత్స్యకారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, సముద్రంలో విడుదల చేస్తున్న శుద్ధి చేయని విష వ్యర్థాలు వల్ల మత్స్య సంపద నాశనం అవుతున్నప్పటికీ, మత్స్యకారుల ఉపాధి కొల్లగొడుతున్నప్పటికీ, మత్స్యకారులకు మాత్రం ఆ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. 70 శాతం స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ పరిశ్రమల యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై అధికారులు, ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కుంటి సాకులు వెతుకుతూ మత్స్యకార భరోసా సుమారు పదివేల మందికి నిలిపి వేసిందని విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ మత్స్యకారులకు ఎటువంటి అభివృద్ధి జరగటం లేదన్నారు. మత్స్యకారులకు పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, మత్స్యకారుల్లో ఉన్న ఉప కులాలను విడగొట్టి కార్పొరేషన్లు ఏర్పాటు చేయవద్దని మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్యకార సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శంకరరావు, కోశాధికారి పిరాది శ్రీను, మోసా ఆనందరావు, కాకినాడ జిల్లా అధ్యక్షులు సిహెచ్ స్వామి, అధ్యక్షులు గంధాని శ్రీను, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. జగ్గారావు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కోనాడ చిట్టెమ్మ, ఎస్.ఆనంద్, వరహాల రావు తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక ఫిషింగ్ హార్బర్ పనులను తక్షణమే చేపట్టాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పూడిమడక ఫిషింగ్ హార్బర్ పనులను తక్షణమే చేపట్టాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఉమ్మిడి జగన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మత్స్యకారులతో కలిసి ఫిషింగ్ హార్బర్ ప్రాంతాన్ని పరిశీలించి, తక్షణమే హార్బర్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆందోళన నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా జరుగుతుండగా కూటమి ప్రభుత్వం వచ్చాక హార్బర్ పనులను ఆపేసారన్నారు. మత్స్యకారులు అంటే చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. సముద్రంలో చేపల వేట జీవనాధారంగా బ్రతుకుతున్న మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేస్తే మత్స్యకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే, ఎంపీ చొరవ తీసుకొని ఫిషింగ్ ఆర్బర్ పనులను ప్రారంభించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమ్మడి కాసులమ్మ అప్పారావు, గనగళ్ళ దేముడు, దూడ మసేను, ఎరిపల్లి శ్రీను, చోడిపల్లి అచ్చయ్య, మైలపల్లి పోలయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండేటట్లు అధికారులు ప్రజలందరికీ అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా డ్రైనేజీలు, కాలువలు, రోడ్లమీద చెత్త లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉండేటట్టు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు తగు సూచనలు చేశారు. ఎవరికి ఇబ్బంది కలిగిన తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై మైనింగ్ విజిలెన్స్ ఎస్పీకి ఫిర్యాదు

విశాలాంధ్ర - చోడవరం: మండలంలో జరుగుతున్న ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలపై సోమవారం విశాఖపట్నం ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేసినట్లు చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి పీ.వీ.ఎస్.ఎన్.రాజు మీడియాకు తెలియజేశారు. మండలంలోని పలు గ్రామాలలో విస్తృత స్థాయిలో జరుగుతున్న ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేనాని రాజు ఎస్పీతో మాట్లాడుతూ చోడవరం మండలంలో ప్రభుత్వం అనుమతిచ్చిన అధికారిక క్వారీలు లేవని తెలిపారు. శారదా, పెద్దేరు, బొడ్డేరు నదీ తీరంలో అనధికారికంగా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని తెలియజేశారు. మండలంలోని శేమునాపల్లి, గవరవరం, లక్కవరం, వెంకన్నపాలెం, నరసాపురం, రాయపురాజుపేట, గజపతినగరం, జుత్తాడ, భోగాపురం, అంబేరుపురం, గౌరీపట్నం తదితర గ్రామాల్లో అక్రమ తవ్వకాలు ఉధృతంగా సాగుతున్నాయని వివరించారు. అక్రమ తవ్వకాల్లో పాల్గొన్నవారు స్థానిక అధికారులను, మీడియాను పట్టించుకోకుండా రాత్రింబవళ్లు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అక్రమ తవ్వకాలపై సాక్ష్యాలుగా కొన్ని ఫోటోలు, వీడియో ఆధారాలు మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురితమైన వార్తా కథనాలను సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారికి సమర్పించామన్నారు. విజిలెన్స్ విభాగం ద్వారా నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ చేపట్టాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్పీని కోరారు. ఈ తవ్వకాల వల్ల జరిగిన పర్యావరణ మరియు ఆర్థిక నష్టాన్ని అంచనా వేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యోగా శిక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - సబ్బవరం: ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగ డే సందర్భంగా యోగా శిక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎంపీడీవో పి.పద్మజ కోరారు. మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 27 నుండి 31వ తేదీ వరకు సుమారు 200 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఎంపిక చేసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని సచివాలయం, ఎన్ఆర్జిఎస్, ఉపాధ్యాయ ఉద్యోగులను 200 మందిని ఎంపిక చేసి వారికి ఈనెల 27 నుండి 31వ తేదీ వరకు శిక్షణ ఇచ్చి వారితో గ్రామస్థాయిలో ఒక్కొక్కరితో 150 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

మహిళా సాధికారతకు కూటమి కృషి: ఎమ్మెల్యే

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

విశాలాంధ్ర - సబ్బవరం: మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన అనంతరం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. బీసీ కార్పొరేషన్ సహకారంతో మండలంలో 144 మంది మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేస్తే 80 మంది మహిళలు శిక్షణలో పాల్గొన్నారని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలని, గౌరవించాలని, మహిళలను ముందుకు నడిపించాలన్నారు. వచ్చే నెలలో 24 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించబోతున్నారని అన్నారు. అనంతరం పకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీ లక్ష్మీ రాణి రాము, మామిడి లక్ష్మి కొండాజీ, కూటమి నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, చొక్కాకుల గోవింద్, బంతికోళ్ల పద్మ, బలిరెడ్డి రామ కృష్ణ, బయలుపూడి దేముడు, మామిడి శంకర్రావు, బోకం స్వామి నాయుడు, శీరం అప్పలరాజు, వల్లా రమణ, సబ్బవరపు రమణ, గొర్లి కుమార్, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, కొల్లి కృష్ణ, మంగరాజు, కర్రి నరసింగరావు కూటమి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

యోగ గురువులకు ఎస్పీ ఘన సత్కారం

విశాలాంధ్ర - చోడవరం: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందికి యోగా తరగతులు నేర్పుతున్న గురువులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఘనంగా సత్కరించారు. అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో, జిల్లా ఆయుష్ వైద్యాధికారిని లావణ్య ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్ వారందరికీ యోగ ప్రోటోకాల్ నేర్పించినందుకుగాను యోగా గురువు పుల్లేటి సతీష్‌తోపాటు యోగ గురువులు శ్రీను చంద్రిక జగన్‌లను ఎస్పీ తుహిన్ సిన్హా సత్కరించారు. సంపూర్ణ ఆరోగ్యానికి మానవ జీవితంలో యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.

ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభం

విశాలాంధ్ర - మునగపాక: మీజిల్స్ రూబెల్లా (ఎం.ఆర్)వాక్సినేషన్ క్యాంపెయిన్ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.చంద్రశేఖర్‌దేవ్ మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వ్యాక్సిన్స్ నిల్వ చేస్తున్న రిఫ్రిజిరేటర్‌లను పరిశీలించి, నిత్యం విద్యుత్ సరఫరా ఉండేటట్లుగా చూసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో ఉన్న అన్ని రికార్డులు పరిశీలించారు. 31-05-2025వ తేది వరకు అన్ని గ్రామాల్లో పెండింగ్ ఉన్న వాక్సినేషన్ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా గణాంక అధికారి ఏ.రామచంద్రరావు, అరుణాచలం, పీహెచ్సీ వైద్యాధికారిణి డా.ఎం.నాగలక్ష్మి, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - యలమంచిలి: అహల్య అబ్బాయి హెూల్కర్ జయంతిని పురస్కరించుకుని యలమంచిలి మున్సిపాలిటీలో డ్వాక్రా మహిళలకు అహల్య అబ్బాయి హెూల్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమా కుమారి మాట్లాడుతూ ఈ పోటీల్లో మొదటి బహుమతి కింద మంగళగిరి చేనేత చీర అందిస్తామని, అలాగే 10 మందికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని అన్నారు. ఈ బహుమతులు 31వ తేదీన జన్మదిన వేడుకల్లో పెద్దల చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఈ వ్యాసరచన పోటీల్లో 65 మంది మహిళలు పాల్గొనగా, న్యాయ నిర్ణేతులుగా డిగ్రీ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ ఏపీ జగన్నాథం, కొటారు శ్రీను మాస్టారు వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్ల కొండ బాబు, ఊటకూటి రమేష్, నక్క శివశంకర్, మనీషా బేగం, మెప్మా ప్రాజెక్ట్ అధికారి పద్మావతి, ఆర్‌పిలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సంఘటితంగా ఎదుర్కొనాలి

విశాలాంధ్ర - మునగపాక: నేటి సామాజిక, ఆర్థిక విధానాల ఫలితంగానే మహిళలు సమస్యలు ఎదుర్కుంటున్నారని, వాటిని మహిళలు సంఘటితంగా ఎదుర్కొనాలని ఐద్వా నాయకులు డి.రమాదేవి, బి.పద్మ పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గల దావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో మహిళా చైతన్య శిక్షణా తరగతులు సోమవారం ముగింపు సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు కారణం ప్రభుత్వం పెట్టుబడిదారుల, వ్యాపారుల లాభాలకు పెద్ద పీట వేయడమేనన్నారు. ఉపాధి లేక తక్కువ వేతనాలకు మహిళలు అధిక శ్రమ చేస్తూ శ్రమ దోపిడికీ గురవుతున్నారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కొరకు జరుగుతున్న సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతుందని, కానీ ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడంలో విఫలమైందని ఆరోపించారు. 100 రోజుల్లో గంజాయి లేకుండా చేస్తామన్న మాటలు మూటలుగానే ఉన్నాయన్నారు. పొదుపు మహిళలకు ఇంత వరకు వడ్డీ రాయితీ అమలు చేయలేక పోయిందని వాపోయారు. అనకాపల్లి జిల్లాలో అనేక చోట్ల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఇంతవరకు నిందితుల పై చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రోజూవారీ ఎదుర్కొనే సమస్యలను పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తూ ఐక్యంగా రాజకియ, ఆర్థిక వ్యవస్థ లోపాలపై కూడా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ "మహిళా సంఘం ఆశయాలు- కర్తవ్యాలు "అనే అంశంపై చేసిన బోధన మహిళలను ఆకట్టుకుంది. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు అలరించాయి. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వై.సత్యవతి ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతులలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డి.డి వరలక్ష్మి, పూర్ణ, రమణి, ఆర్. లక్ష్మి, వాణి, జి.సుభాషిని, సిహెచ్.మంగతాయారు, గౌరీ, సూర్య ప్రభ తదితరులు పాల్గొన్నారు.